# కలియుగ సావిత్రి

– వడ్లమాని బాలసుందరి

'ట్రింగ్ ట్రింగ్' మని అదే పనిగా మోగుతున్న ఫోన్‌ని అందుకుని 'హెల్లో' అంది సుజాత. "సుజా సుజా నేనే సావిత్రిని' అని వినగానే, సుజాత నిద్ర ఎగిరిపోయింది, గబుక్కున లేచి బెడ్ లాంప్‌ని వెలిగించి హెలో సావిత్రి ఏమైందే? వాట్ ఈజ్‌ద మేటర్?" అని అడుగుతూ టైము ఇంకా 3గం॥ 25ని. అయిందని చూసి కంగారు పడింది. అటునుండి సావిత్రి వణుకుతున్న గొంతుకతో "సుజా! అంతా అయిపోయిందే నా బ్రతుకే తెల్లారిపోయింది. సుజా" అని ఏడవసాగింది. సుజాత గుండెల్లో రాయి పడినట్లైంది కాళ్లు చేతులు వణకసాగాయి. "ఏమిటే సావి ఏమైందే? మానస కేమైనా జ్వరమా లేక చింటూ గాడికి బాగులేదా? లేకపోతే నాగ్ ఏమైనా గొడవ చేసేడా? చెప్పవే తొందరగా" కొంచెం జీరబోయిన గొంతుకతో "సుజా, నువ్వు వెంటనే బయలుదేరి రావే. అర్జంటుగా రా, ఆలస్యం చెయ్యకు. వివరాలు నీకే తెలుస్తాయి" అని సావిత్రి ఫోన్ పెట్టేసింది.

సుజాతకు నిద్ర మత్తు మాయమైంది. గబగబ బట్టలు మార్చుకుని కారు తాళాలు తీసుకుని, లిఫ్ట్ కోసమైనా ఎదురు చూడకుండా ఆరో ఫ్లోరునించి చకచకా మెట్లు దిగుకుంటూ, పరుగులాంటి నడకతో కారు స్టార్ట్ చేసి, సావిత్రి వాళ్లింటికేసి బయలుదేరింది.

"ఏమై ఉంటుందబ్బా? సాధారణంగా సావిత్రి కంగారు పడిపోయే మనిషికాదే". అని ఆలోచిస్తూ ఖాళీ రోడ్డు కావడంవల్ల కొంచెం స్పీడుగానే డ్రైవ్‌చేస్తోంది సుజాత. ఆమె డ్రైవ్ చేస్తూనే గతంలోకి వెళ్లిపోయింది.

సావిత్రి, సుజాత ఒకటవ తరగతి నించి స్నేహితులు, సావిత్ర మొదటి నించి చాలా కలివిడయినది. మంచి కనుముక్కుతీరుతో, దబ్బ పండులాంటి మేని ఛాయతో చూపరులను ఆకట్టుకొనే రూపం ఆమెది. సుజాత చామన ఛాయ. చాలా సీదా సాదాగా ఉండేది. చదువులో, పోటీల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో సావిత్రిదే మొదటి స్థానం. ఆమెకి ఉన్న చొరవ, వాక్ పటుత్వం, స్నేహస్వభావం ఆమెని కాలేజీలో చాలా పాపులర్ చేశాయి. తను ఎంత కష్టపడ్డా సావిత్రి స్థానాన్ని చేరుకోలేకపోయేది. వీళ్లిద్దరి స్నేహాన్ని చూసి అసూయపడేవారు. అప్పుడే రమణతో పరిచయమైంది. ఎవ్వర్నీ దగ్గరికి రానివ్వని సావిత్రి కూడా అతని సౌశీల్యానికి, తెలివి తేటలకి, మంచితనానికి ఆకర్షింపబడింది. ఈ స్నేహం మెల్లిగా ప్రేమకి దారి తీసింది. వీళ్ళ ప్రేమ ఒకళ్లనొకళ్లు వీడలేనంత గాఢంగా తయారైంది. వీరిద్దరి కులాలు వేరు కనుక పెళ్లికి ఇద్దరి వైపునించి అనుమతి దొరకదని తెలుసు. కనుక చదువు లయ్యేదాకా పెద్దవారికి తెలియకుండా జాగ్రత్త పడాలని అనుకున్నారు.

రమణ ఎంఏ పాసై, రిజర్వ్ బ్యాంక్‌లో జూనియర్ ఆఫీసర్‌గా సెలక్టయి హైద్రాబాదులోనే పోస్ట్ అయ్యాడు. అప్పటికి సావిత్రి ఎంఏ ప్రీవియస్, నేను, మొదటి సంవత్సరం పూర్తిచేశాం. వెంటనే ఇద్దరూ తమ పెద్దవాళ్లకి వాళ్ళ పెళ్లి విషయం తెలపడం "వాళ్లు దానిని వ్యతిరేకించడం. మీరు పెళ్లి చేసుకుంటే మాతో ఎటువంటి సంబంధ బాంధవ్యాలు ఉండవని చెప్పడం" జరిగాయి.

ఏదేమైనా ఎదుర్కొనేందుకు సిద్ధమేనని వాళ్లిద్దరూ స్నేహితుల సమక్షంలో రిజిస్టర్డ్ మ్యారేజి చేసుకుని కాపురం పెట్టేరు. సావిత్రి ఎంఏ పూర్తి చెయ్యనేలేదు. తమ దాంపత్యపు మధురిమలు చవిచూస్తూ, ఏడాది తిరిగే సరికి మాతృమూర్తి అయింది. రమణ ఆనందాన్కి అంతే లేదు. ఇద్దరి పేర్లూ కలిసేట్టుగా, పాపకి 'మానస' అని పేరు పెట్టేడు. వాళ్ల పెద్దవారికి ఈ విషయం తెలియపర్చినా వారి వద్దనించి ఏవిధమైన జవాబు లేదు. సావిత్రి ఆడది గనుక కొంచెం బాధపడింది.

రమణైతే దీనికి జవాబొస్తుందని ఎదురు చూడలేదు. అతనికి సవితి తల్లితో అంతంతమాత్రం సంబంధాలే. పాప తోటిదే అతని లోకమైంది.

అనుకోకుండా రమణ మేనమామ, అతని తల్లి పేర ఉన్న స్త్రీధనం తాలూకు సొమ్ముని అతడికి పంపేడు. దాంతో రమణ బేగంపేటలో ఓ రెండు బెడ్‌రూమ్‌ల ఫ్లాట్ తీసుకున్నాడు. ఇంకో ఆర్నెల్లలో పూర్తి అవుతే దాంట్లోకి మారిపోవచ్చనుకున్నారు. మానస మొదటి పుట్టినరోజుని చాలా ఘనంగా హోటలులో పార్టీ ఇచ్చి జరుపుకున్నారు. పార్టీ అయ్యాక రాత్రి 11గం॥లకు రమణ సావిత్రిని పాపని తీసుకుని బైక్‌మీద ఇంటికి బయలుదేరేడు. పార్టీ కబుర్లు చెప్పుకొంటూ మెల్లిగా డ్రైవ్‌చేస్తున్నాడు రమణ. ఇంతలోకి ఎదురుగా ఓ బస్ బ్రేక్ ఫెయిల్ అయి, ఇతని బైక్‌ని ఢీ కొంది. రమణ అక్కడి కక్కడే మరణించాడు సావిత్రికి బాగా దెబ్బలు తగిలి మూడు నాలుగు నెలలు ఆసుపత్రిలో ఉండవలసి వచ్చింది. విచిత్రంగా పాపకు దెబ్బలు తగలలేదు.

రమణ తండ్రీ పిన్ని వచ్చి, అతని అంత్యక్రియలు మొక్కుబడిగా పూర్తిచేసి వెళ్లేరు. రమణ సవితి తల్లి, సావిత్రిని నానా మాటలు అని, ఆమె వల్లే చెట్టంత కొడుకు పోయాడని, శాపనార్థాలు పెట్టి వెళ్లింది.

సావిత్రి ఈ షాక్ నుండి తేరుకోవడానికి ఓ ఏడాదిపైనే పట్టింది. రమణ స్నేహితుల సహాయంతో సావిత్రికి కంపాషనేట్‌గ్రౌండ్స్ మీద క్లర్క్‌గా రిజర్వ్ బ్యాంక్‌లో ఉద్యోగమొచ్చింది. సావిత్రి పాపతో, రమణ తీసుకున్న ఫ్లేట్‌లోకి మారిపోయింది. ఇప్పుడు ఆమెకు పాపతోడిదే లోకమై, చాలా నిర్లిప్తంగా జీవితాన్ని గడిపేస్తోంది.

జీవితం మనం అనుకున్నట్లు జరిగితే అది జీవితమే కాదేమో! మలుపు మలుపుకి ఓ మంచి ఓ చెడు ఎదురౌతూనే ఉంటాయి కాబోలు.

సావిత్రి పక్క ఫ్లేట్‌లోకి నాగేంద్ర అద్దెకు దిగేడు. అతను ఓ పెద్ద కంపెనీలో కంపెనీ సెక్రటరీగా పనిచేసేవాడు. పాపతో చేరికై సావిత్రికి కూడా పరిచయమయ్యాడు. మానస ఆటపాటల గురించి ఆమె చేసే చిలిపి చేష్టల గురించి మాట్లాడుతూ సావిత్రిని మామూలు మనిషి చేయడంలో చాలా సహకరించేడు. ఇంకో రెండు మూడేళ్ళలో వాళ్లిద్దరూ చాలా చేరికయ్యారు. ఒక రోజు నాగేంద్ర సావిత్రికి అభ్యంతరం లేకపోతే తాను పెళ్లి చేసుకుంటాను అనే ప్రతిపాదన తెచ్చేడు. సావిత్రి తనకు మళ్లీ వివాహమాడే ఉద్దేశ్యమే లేదని అతని ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించింది. సుజాతే ఆమెకు నచ్చచెప్పింది. సావిత్రికి ఇంకా బోలెడు జీవితం గడపాలని పాప బాధ్యత తనొక్కర్తే తీసుకునేకన్న నాగ్‌ని పెళ్లి చేసుకుంటే, ఇద్దరూ కలిసి పంచుకోవచ్చని పాపతో అతడు ఈ రెండు మూడేళ్లైనా బాగా మాలిమి అయ్యాడు కనుక పెళ్లి చేసుకున్నా ఎటువంటి ప్రాబ్లెమ్స్ రావని. పెళ్లితో తనకో తోడే కాకుండా జీవితానికి ఓ సెక్యూరిటీ కూడా ఉంటుందని నచ్చచెప్పింది. అలా నాగ్, సావిత్రులు

## హైకూలు

పొద్దున్నే
మా తోటలోని గులాబీ
గుడ్‌మాణింగ్ చెప్పింది...

పిల్లగాలి
నాతోపాటే
వాకింగ్ చేస్తూ

గాలి
నా చెవిలో
ప్రియురాలిలా గుసగుస...

తారలు ఆకాశ హర్మ్యంలో
దీపాలు

కొమ్మ కాయల బరువుకు
నడుం వంచింది

ధైర్యం
గుండెకు
దీపం

– బద్ది నాగేశ్వరరావు

దంపతులయ్యారు. ఆపై ఏడాదికి చింటూ పుట్టడం, నాగ్‌కి బొంబాయిలో మంచి ఉద్యోగం రావడం జరిగింది. వీళ్ల కాపురం బొంబాయికి మార్చేసారు. సావిత్రి అప్పటికే అఫీసరుగా సెలెక్ట్ అవడం వల్ల తేలికగానే బోంబే పోస్టింగ్ దొరికింది.

వెనక నించి కారు హార్న్ విని సుజాత ఈ లోకంలో పడి మళ్లీ డ్రైవ్ చెయ్యడంలో మునిగిపోయింది. ఈ అయిదేళ్లు ఎలా గడిచాయో తెలియనంత తొందరగా గడిచిపోయాయి. తను అడ్వకేటుగా స్థిరపడింది. ఏ కారణాల వల్లనైతేనేమి సరైన చెలికాడు దొరక్క తను అవివాహితగానే ఉండిపోయింది. ఓ ఆరునెలల క్రితం సావిత్రి నాగ్ దంపతులు హైదరాబాద్ తిరిగి వచ్చేరు. సావిత్రిలో చాలా మార్పు వచ్చింది, చాలా గంభీరంగా మారిపోయింది. చాలా ఉదాసీనంగా కన్పిస్తోంది. నాగ్ హైసొసైటీ బర్డ్‌గా మారిపోయాడనీ, బాగా డ్రింక్ చేస్తున్నాడనీ తెలిసింది. మరి ఇప్పుడు ఏం ముంచుకొచ్చిందో అని ఆలోచిస్తూ సావిత్రి వాళ్ల ఫ్లేట్‌కి చేరింది. తలుపు తెరిచే ఉన్నట్లుచూసి మెల్లిగా లోపలికి "సావిత్రి" అని పిలుస్తూ ప్రవేశించింది. డ్రాయింగ్ రూమ్ అంతా నిశ్శబ్దంగా నీటుగా సర్దినట్లే ఉంది. డైనింగ్ రూమ్‌లో ఓ చిన్న లైటు వెలుగుతూ ఉంది. గబగబా సుజాత అక్కడికి చేరుకుంది. అక్కడి దృశ్యాన్ని చూసి షాక్‌తో అలా నిలబడిపోయింది. తను అడ్వకేట్ అయ్యుండి ఎన్నో రకాల కేసులను డీల్ చేస్తూ ఉండే తనకే అక్కడి దృశ్యం ఒళ్లు జలదరింప చేసింది. రూమ్‌కి మధ్యలో నాగ్ పొట్టలో కత్తిదిగి వెల్లకిలా చచ్చిపడి ఉన్నాడు. రక్తం ధారగా కట్టి ఎండిపోయి ఉంది. అతడి కళ్లు, నోరు తెరుచుకునే ఉన్నాయి. ఆ కళ్లలో ఒక రకమైన ఆశ్చర్యం భయం కనిపిస్తున్నాయి. కొంచెం పక్కకి మానస నిద్రపోతున్నట్లు పడి ఉంది. పిల్లఒంటి మీద బట్టలు అస్తవ్యస్తంగా నెత్తురు మరకలతో ఉన్నాయి. ఆమె కాళ్లకింద నించి రక్తంకారి ఎండి పోయినట్లు ఉంది. ఆమె చేతుల నిండా రక్తం. కానీ, చాలా ప్రశాంతంగా నిద్రపోతున్నట్లుంది. ఇంకోవైపు చింటూగాడు నిద్రపోతున్నాడు కానీ, ఏదో అసహజత్వం! పిల్లలిద్దరిమీదా చేతులేసి ఓ శోకదేవతలా సావిత్రి కూర్చుని ఉంది. ఏ రకమైన భావాలు ఆమె ముఖంలో కనిపించడంలేదు. సుజాతని చూడగానే "వచ్చావా సుజా" అని బొంగురు గొంతుతో, వినీ వినపడనట్లుగా అంది.

"ఏమిటే సావీ? ఏమిటిదంతా" అని గొంతు పెగుల్చుకుని, గబగబా సావిత్రి దగ్గరికి వెళ్లి ఆమె భుజంమీద చెయ్యివేసి కూర్చుండిపోయింది. సుజాత స్పర్శతో ఇంతదాకా రాయిలా కూర్చున్న సావిత్రి, ఆమె చేతులు పట్టుకుని భుజంమీద తలాన్చి భోరుమని ఏడవసాగింది. ఓ రెండు నిముషాల తర్వాత తెప్పరిల్లి "అయిపోయింది సుజా, నా జీవితం మూణ్ణాళ్ళ ముచ్చటైపోంది. ఏదో నా బ్రతుకు నేను బ్రతుకుతున్నానంటే ఈ నాగ్ నా జీవితాన్నే హరించేశాడు. సుజా, వీడితో నేనెన్ని కష్టాలకోర్చానో, నీ కెప్పుడూ చెప్పలేదే, నాగ్ ఓ శాడిస్టు, మనిషి ఎంతో మంచి వాళ్లాగే కనిపిస్తాడు. కానీ, వాడి అసలు రూపం నువ్వు ఊహించనుకూడా ఊహించలేవే. వాడు నన్ను మానసికంగా ఎంత హింసించాడో నానోటితో నేను చెప్పలేను. పెళ్లైన మొదటిరాత్రి "ఏం సావిత్రి అలా సిగ్గుపడుతున్నావేమిటి? నీ కిది ఫస్ట్‌నైట్ కాదే? ఏం ఆ చచ్చిన వాడితో ఎలా గడిపావో గుర్తు చేసుకుంటున్నావా?' అని ఎన్నో రకాలుగా నన్ను చిత్రవధ చేసాడు. ఒక రకమైన క్రూరత్వంతో పశువుకన్నా హీనంగా ప్రవర్తించేవాడు. నన్ను శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. నేను నా చేతులారా చేసుకున్నదే గదాని ఇన్నాళ్లూ నోరువిప్పకుండా అనుభవించేను. కానీ సుజా అని భోరుమని ఏడవసాగింది. మళ్లీ తనను తాను సంబాళించుకొని "సుజా! వాడికి బోలెడు మంది ఆడవాళ్లతో సంబంధాలు ఉండేవి. కానీ, ఇంత దిగజారిపోతాడని నేనూహించలేదు. నువ్వేదానివి మానస మా ఇద్దరి అందాలు పుణికి పుచుకున్నదని, నాకన్నా అందంగా తయారౌతుందని గుర్తుందా? ఆ అందమే దానిపాలిటి శత్రువైంది, పాపకి 10 ఏళ్లు నిండేప్పటికి బాగా ఎత్తరిగా ఎదగడం మొదలు పెట్టింది. దాని అందం సహజంగానే

మెరుగు దిద్దుకొని ఆకర్షణీయంగా తయ్యారైంది. కెన్ యూ ఇమాజిన్ సుజా! నా కూతురు నా కూతురు అనే నాగ్ కళ్లు దాని మీద పడ్డాయి! మా పెళ్లైనప్పటినించి మానస నాగ్‌ని డాడీ అని పిలవసాగింది. అలాంటి ఆ కూతుర్నే కాంక్షనిండిన కళ్లతో చూడసాగేడు. ముందు నా ఊహ తప్పేమో లేనిపోని అనుమానాలతో అతణ్ణి తప్పుపడ్తున్నానేమో అని ఊరుకున్నాను. కానీ, ఓ రోజు మానస వచ్చి"అమ్మా బాడ్ డాడీ, నన్ను గట్టిగా హగ్ చేసి నా లిప్స్ మీద కిస్ చేశారు. ఛీ ఛీ అది రాంగ్ కదమ్మా" అని అంటుంటే ఏదో సర్ది చెప్పడం తప్ప ఏం చెయ్యాలో తెలియలేదు.

నాగ్ బోంబే వెళ్లేక బాగానే సంపాయించేవాడు. రోజూ క్లబ్‌కి వెళ్లడం డ్రింక్ చేయడం రెగ్యులర్‌గా మొదలుపెట్టేడు. ఇలా చెయ్యవద్దని అన్నందుకు నాతోపేచీ పెట్టుకుని నానా మాటలు అనేవాడు. ఆ తాగిన మైకంలో పిల్లమీద ఏ అఘాయిత్యం చేస్తాడోనని పిల్లలు పడుకున్నాక రూమ్‌కి తాళం వేసి రాత్రంతా జాగారం చేసేదాన్ని. ఇంతట్లోకి ఈ ఊరుకి రావడం జరిగింది. అతనే మైనా మారుతాడేమోఅని ఆశపడ్డాను. కానీ, ఇంకా బరితెగించి పోయాడు. నేను ముసలమ్మనైపోయానట, లైఫ్‌లో ఓ థ్రిల్‌గానీ ఆనందంగానీ లేదట. ఓ ఫ్రిజిడ్ వుమన్‌లా అయిపోయానట "అబ్బబ్బ ఏం అందాలే మానసవి. ఇంత గుంటము... కి ఏం బాడీ ఇచ్చాడే దేముడు" అనేవాడు. కూతుర్ని పట్టుకుని అలా అనడం బాగాలేదంటే, దానికి నేనేమైనా నిజం తండ్రినా? ఏవో చిన్న చిన్న థ్రిల్స్ నేను పొందుతూంటే నువ్వేంటి మధ్యలో" అనేవాడు. నిన్న రాత్రి కొంచెం తొందరగా వచ్చేసాడు. కొంచెం తాగేసి వచ్చినా పిల్లల్తో నవ్వుతూ మాట్లాడాడు. మానసతో "ఏం బేబీ నీ స్టడీస్ ఎలా ఉన్నాయి?' అన్నాడు. మానస అతని దగ్గర కూర్చొని మరేమో డాడీ మా స్కూల్లో.... ఆన్యువల్ డే వస్తోందిగా దాంట్లో నా సాంగ్ ఉంది మరేమో ఓ సోలో డాన్స్ ఉంది. మా టీచర్ మాచేత బాగా ప్రాక్టీస్ చేయిస్తోంది" అంది. "ఓ ఐసీ ఏదీ నీ డాన్స్ చేసి చూపెట్టు" అన్నాడు. మానస పాటపాడుతూ డాన్స్ చేయడం మొదలు పెట్టింది. అతను చప్పట్లుకొడుతూ ఊగిపోతూ 'వెరిగుడ్ వెరీగుడ్' అంటూ దానితో డాన్స్ చేయడం మొదలుపెట్టేడు. అతని కళ్లల్లో ఓ వింత క్రూరత్వం, కోరికా కదలాడసాగాయి. పాపం దాన్ని గట్టిగా కౌగలించేసుకొని దాని బుగ్గలు కొరకడం మొదలుపెట్టేడు. పాప "డాడీ నెప్పి... అమ్మా అమ్మా" అని ఏడవడం మొదలు పెట్టింది. నేను అడ్డు వెళ్తే, వెనకనించి నా జడ పట్టుకొని ఈడ్చుకుంటూ కిచన్‌లోకి నెట్టి బైట గొళ్లెం పెట్టేశాడు. నేనా కిటికీలోంచి "వద్దు నాగ్ వద్దు, పాపని ఏం చెయ్యకు" అని బతిమాలుకున్నాను. "ఏం చేస్తావే ఓసి లం... అని నన్ను తిడుతూ, ఏడుస్తున్న పాపని నా ఎదుటే బలాత్కరించేశాడే...." అని పెద్దగా ఏడవడం మొదలుపెట్టింది. దాన్ని ఊరడించడం నావల్ల కాలేదు. "సుజా! ఏ తల్లీ ఇంతటి శిక్ష అనుభవించి ఉండదే. మా అమ్మానాన్నలని ఎదిరించి వచ్చేసాను కదూ, వాళ్ల కడుపుకోతే నన్నిలా బాధిస్తోందేమోనే" అని ఏడుస్తూంటే ఏం చెప్పను? పక్క నున్న కూజాలో నీళ్లొంచి తాగించేను.

ఆమె వెక్కుతూ చెప్పడం మొదలు పెట్టింది. "నా పాప ఏడుపు నా గుండెల్లో గునపాల్లా గుచ్చుకుంటూంటే ఏం చెయ్యాలో తెలియక పిచ్చికుక్కలా ఆ వంటింట్లో తిరిగేను. వాడి నడ్డి నావైపు, మొఖం గోడవైపు ఉంది. కిటికీ లోంచి నిస్సహాయంగా చూస్తున్నాను. వాణ్ణెలాగైనా చంపెయ్యాలనే కసి నాలో బయలు దేరింది.

## దృష్టి

**బం**గారపు ముద్దల్ని కూడా
మట్టి ముద్దలుగా
తలచేవాడు యోగి
మట్టి ముద్దల్లో కూడా
బంగారాన్ని
దర్శించేవాడు భోగి

– బద్ది నాగేశ్వరరావు

ఇంతలో నాకక్కడ కొబ్బరికాయ వలవడానికి తెచ్చిన కత్తి కనిపించింది. దాన్ని తీసి కిటికి ఊచల్లోంచి వాడి మీదకి విసిరాను. నా వణికే చేతులు కూడా గురితప్పకుండా పనిచేసాయి. కత్తి తిన్నగా వెళ్లి వాడి వెనకనించి గుండెల్లో దిగింది. నా కంత బలం, శక్తి ఎలా వచ్చేయో ఆ దేముడెరుగు, నోట మాట రాకుండా వాడు వెనక్కిపడిపోయాడు. ఇంతలో చింటూగాడు నిద్రలోంచి లేచి ఏడుస్తూ వచ్చేడు. వాడిచేత గొళ్లెం తీయించి బయటపడ్డాను.

మానస స్పృహ తప్పి పడిపోయింది. ఏం చేయాలో తోచలేదు. పిల్లలిద్దర్నీ పెట్టుకుని చాలా సేపు కూర్చుండిపోయాను. ఫోను అదే పనిగా మోగుతుంటే ఈ లోకంలో పడ్డాను. టైము 11గం॥ అయింది. పక్క ఫ్లాట్ వాళ్లు ఊర్లోలేరు. మిగతా ఫ్లాట్‌లవాళ్లు రోజూ ఉండే బాగోతమే అని మా ఇంట్లోని గోల గురించి పట్టించుకోలేదనుకుంటాను. అప్పుడు నా బుర్రకొంచెం పనిచేయడం మొదలుపెట్టింది. నాగ్‌గాణ్ణి చంపినందుకు నాకు ఏ ఉరి శిక్షో లేకపోతే ఆజన్మాంత కారాగారశిక్షో పడుతుంది. దానికి నేను తయారే కానీ, నా ఈ చిన్నార్లు ఏమైపోతారు? నా పాపని ఈ సంఘం వెలివేయదని ఏం గ్యారంటీ? లేకపోతే ఏ నరక కూపంలోకో తోయబడితే? బాబు ఏ పిక్‌పాకెటేర్‌గానో లేక ఏ గూండాగానో తయారైతే. వీళ్ల బాధ్యత ఎవరు తీసుకుంటారు? అందుకే ఓ నిర్ణయానికి వచ్చి నాగ్ వేసుకునే నిద్రమాత్రలు పాలలో కలిపి పట్టేశాను. చూడు, ఎంత హాయిగా నిద్ర పోతున్నారో. సాకవలసిన తల్లే చంపేసిందని వాళ్ళకేం తెలుసు. ను కూడా నిద్రమాత్రలు మింగేద్దామనే అనుకున్నానే. కానీ, ఈ లోకానికి నా కథ తెలియాలి, లేకపోతే మరో తల్లి నాలాంటి తప్పే చేస్తుంది. ఆడపిల్లన్నికన్నతల్లి, ఆ ఆ పాపను జాగ్రత్తగా పెంచి పెద్ద చెయ్యాలేకానీ నాలా మళ్లీ పెళ్లి చేసుకోకూడదు. ఎంత తండ్రీలాంటి వాడైనా సవతి తండ్రి ఓ మగాడేకదా! వాళ్ళలో రాక్షసుడి లాంటి వాళ్ళూ ఉంటారని తెలియాలి.

అయిపోయింది సుజా, ఈ సావిత్రి కథ ఇంతటితో ముగిసింది. అలనాటి సావిత్రి భర్త ప్రాణాలకై యముడితో పోరాడి, భర్తను కాపాడుకుందట. ఈనాటి సావిత్రి, చూశావా సుజా విచిత్రం, భర్త ప్రాణాలే తియ్యడం గాకుండా తను కన్న ముద్దు బిడ్డల ప్రాణాలను కూడా తీసింది". అని వెక్కివెక్కి ఏడ్వసాగింది. "ఇంక తెల్లవారుతోంది లే సావీ, పోలీసులకు తెలియబరుద్దాం" అని కళ్లు తుడుచుకుంటూ లేచింది సుజాత.

తర్వాత జరిగింది మామూలే. సావిత్రి కథ ఆంధ్రప్రదేశ్‌నే గాక పూర్తిదేశాన్నే ఊపేసింది. ఆమెకు ఆజన్మాంత కారాగార శిక్ష విధించడమైంది.

ఈ 14 ఏళ్లలో ఎన్నో మార్పులు... సావిత్రి ఫ్లేట్‌ని అమ్మగా వచ్చిన డబ్బుతోను, బ్యాంకు నించి వచ్చిన పిఎఫ్ వగైరాలతోను మొత్తం సొమ్ముతో ఓ ట్రస్ట్ ఏర్పాటు చెయ్యడం జరిగింది. దానిని నడిపే బాధ్యతలన్నీ సుజాత మీద పడ్డాయి. దాని మీద వచ్చే ఆదాయం తోటి లింగంపల్లిలో అయిదు ఎకరాల జాగాలో 'రమణ' ఆశ్రమాన్ని తెరిచారు. దాంట్లో ఏ ఆధారం లేక మోసగించబడిన స్త్రీలని చేర్చుకుంటారు. వారికి మనోధైర్యాన్ని కల్పించి, రకరకాల వృత్తులను నేర్పి వాళ్ల కాళ్లమీద వాళ్లు నిలబడే ధైర్యం, దన్ను కల్పిస్తుంది ఆ ఆశ్రమం. అందులోనే 'మానస' అనే బడి నడపబడుతుంది. దాంట్లో ముష్టివారి పిల్లలకి, వేశ్యల పిల్లలకి , మోసగింపబడిన ఆడపిల్లలకి ఉచితంగా విద్యనేర్పుతారు. వారిని సంస్కారవంతులుగా తీర్చిదిద్దుతారు. ఇది కాకుండా చింటూ ఓల్డ్ ఏజ్ హోమ్. ఏ ఆధారంలేక పిల్లలచే తిరస్కరింపబడ్డ వృద్ధ వనితలకు ఆశ్రయమిస్తారు. వింత ఏమిటంటే, రమణ సవితితల్లిని కన్నకొడుకులు నిరాధారంగా వదిలివేయగా, ఈ ఆశ్రమమే ఆమెకి ఆశ్రయమిచ్చింది.

ఈ ఆశ్రమ వృద్ధికి ఎందరో దాతల సహాయ సహకారాలు దొరికాయి. సావిత్రి జైలులో ఉండి, సుజాత సహకారంతో తన ఆలోచనలని ఆచరణలో పెట్టగలిగింది సావిత్రి విడుదలై వచ్చి తన ఉనికి ఎవ్వరికీ తెలియనియ్యకుండా ఈ ఆశ్రమాభివృద్ధికి అంకితమైపోయింది. సుజాత ఎన్నటికీ సావిత్రికి పెద్ద అండగా నిలిచింది. ■